క్లుప్తంగా

కలప పట్టివేత



కలపను పరిశీలిస్తున్న అధికారులు

కొయ్యూరు: కాకరపాడులో కె.లోవరాజు అనే వ్యక్తి ఇంట్లో దాచి ఉంచిన 19 రోజ్‌ఉడ్ ముక్కలను, ఐదు టేకు, 20 గన్నెర ముక్కలను స్వాధీనం చేసుకున్నట్టు పెదవలస రేంజర్ శివ రజని బుధవారం తెలిపారు. స్వాధీనం చేసుకున్న కలప విలువ రూ.1.61లక్షలుగా నిర్ధారించినట్టు తెలిపారు.

మాలధారులకు నిత్యాన్నదానం

సాక్షి,పాడేరు: స్థానిక నీలకంఠనగర్‌లోని పచ్చా రవీంద్ర ఇంటి ఆవరణలో ఉచిత మధ్యాహ్న భోజన పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. అయ్యప్ప, భవానీ మాలధారులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా పీఠం గురుస్వామి వెయ్యాకుల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి రోజు మధ్యాహ్నం 12గంటల నుంచి 2గంటల వరకు భోజనాల పంపిణీ కార్యక్రమంను నిర్వహిస్తామన్నారు. డిశంబర్ 2వతేది వరకు నిత్యాన్నదానం కార్యక్రమం జరుగుతుందన్నారు. స్వాములు వెంకటరమణ, ప్రేమ్‌చంద్, లీలాకిషోర్, పోలరాజు, రవీంద్ర, స్వాతికుమార్, శ్రీనివాస్, రాము, గణేష్, అప్పలరాజు, ప్రసాద్, విశేష్‌బాబు, కొండలరావు, మహేంద్ర, ప్రకాష్ తదితరులు పర్యవేక్షించారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు

ముంచంగిపుట్టు: గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎం.శ్రీసాయిహర్ష తెలిపారు. మండల కేంద్రంలో సామాజిక తనిఖీలపై ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు, సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీ సాయిహర్ష మాట్లాడుతూ 2023 ఏప్రిల్ నుంచి మార్చి 31, 2024వరకు జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 13 నుంచి 27వ తేదీ వరకు 23 పంచాయతీల్లో సామాజిక తనిఖీలు చేసి, గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో రూ.24.7 కోట్ల వేతనాలు అందించగా, రూ.96.22లక్షలను మెటీరియల్‌కు ఉపయోగించనట్టు చెప్పారు. ఏపీవో సంఘంనాయుడు, ఎస్‌ఆర్‌పి రాజు, డీఆర్‌పిలు, పిఆర్, ట్రైబల్ వెల్ఫేర్ జెఈలు, టీఏలు, వీఆర్‌పిలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



వైద్య పరీక్షలు చేస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, వైద్యాధికారులు

అరకులోయ రూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా సూచించారు. మండలంలోని బస్కి పంచాయతీ కేంద్రంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. కలుషిత నీరు తాగొద్దని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని, అనారోగ్యమైతే తక్షణమే ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా వైద్యం పొందాలని సూచించారు. శిబిరంలో 60 మందికి వైద్య పరీక్షలు చేశారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. సూపర్ వైజర్లు ముత్యలమ్మ,కుమారి, సుజాత పాల్గొన్నారు.

సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు బ్రేక్?

మహారాణిపేట (విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు మరోసారి బ్రేక్ పడినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల సమావేశాలు సాకుగా చూపుతూ ఎన్నికలు వాయిదా వేసినట్టు తెలుస్తోంది. అయితే అధికారులెవరూ ఎన్నికల వాయిదాను ధ్రువీకరించడం లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సాగునీటి వినియోగదారుల ఓటర్ల జాబితాను బుధవారం ప్రకటించాల్సి ఉన్నప్పటికీ.. జరగలేదు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

కొయ్యూరు: మండలంలోని యూ.చీడిపాలెం పీహెచ్‌సీ వైద్యుడు వి.హేమంత్ ఆధ్వర్యంలో మారుమూల గ్రామాలైన నీలవరం, యర్రగొండ, తీగలమెట్టలో బుధవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. 300 మందికి పరీక్షించారు. ఆయన మాట్లాడుతూ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కలుషిత నీరు తాగొద్దని, నాటు వైద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అనారోగ్యమైతే వెంటనే వైద్యున్ని సంప్రదించాలని సూచించారు. ఎంపీహెచ్‌ఈవో, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గోదాములు ఇలా.. నిర్వహణ ఎలా?

- శిథిలావస్థలో జీసీసీ గొడౌన్లు
- ప్రమాదభరితంగా గోడలు, పాడైన పైకప్పు
- పాడవుతున్న స్టాకు
- సరకుల నిల్వ ప్రశ్నార్థకం
- పట్టించుకోని అధికారులు



జీసీసీ గొడౌన్ దుస్థితి



శిథిల గోదాములో ఉన్న స్టాకు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఉన్న మూడు జీసీసీ గోదాము భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. బీటలు వారిన గోడలు, పాడైన పైకప్పు, ఊడిపోతున్న తలుపులు, అధ్వాన గచ్చుతో దర్శనమిస్తున్నాయి. మండలంలో 23 పంచాయతీల్లో డీఆర్ డిపోలు, అంగన్‌వాడీ కేంద్రాలకు, ఆశ్రమ పాఠశాలలకు పంపిణీ చేసే బియ్యం, నిత్యావసర సరకులు అన్ని నిల్వ చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.భవనాల పరిస్థితుల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది భయపడుతూ విధులు నిర్వహిస్తున్నారు. 1970 సంవత్సరంలో భవనాలు నిర్మించారు.నేటికీ అదే భవనాల్లోనే సరకుల నిల్వకు వినియోగించుకోవాల్సిన పరిస్థితి. భవనాల కింద గచ్చు పాడై మట్టితో దర్శనమిస్తుంది. దీనికితోడు పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడి, ఎలుకలకు నిలయంగా మారాయి.బియ్యం, కందిపప్పు, పంచదార వంటి సరుకులు ఎలుకల బారిన పాడి పాడైపోతున్నాయి. సరకులను కాపాడుకునేందుకు సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలో ఉన్న మూడు జీసీసీ గోదాములలో



ముంచంగిపుట్టులో శిథిలావస్థలో ఉన్న జీసీసీ గోదాము

ఒకటి 2022 సంవత్సరంలో భారీ వర్షాలకు గోదాము గోడలు తడిచిపోయి, పాడిపోయాయి .రేషన్ బియ్యం తడిచి పాడైయ్యాయి. కొన్ని నెలల పాటు టార్పాలిన్లుతో అడ్డుపెట్టి సరుకులను కాపాడుతూ వచ్చారు.తరువాత తాత్కాలిక గోడను నిర్మించారు.పలుమార్లు జీసీసీ గోదాము భవనాల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా నేటికి భవనాల సమస్య పరిష్కారం కాలేదు.

సరకుల నిల్వకు తప్పని పాట్లు

మండల కేంద్రంలో జీసిసి గోదాములు పాడైపోవడంతో సరుకుల నిల్వకు సిబ్బందికి పాట్లు తప్పడం లేదు.మూడు భవనాలలో ఒకటి పూర్తిగా శిథిలం కాగా.రెండు భవనాలు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. ఇందులో ఒక గోదాములో 250 మెట్రిక్ టన్నుల సరకులు నిల్వ ఉంచుకోవచ్చు. మరో భవనంలో 5000 మెట్రిక్ టన్నులు నిల్వకు ఉపయోగిస్తున్నారు. ప్రతి నెల 46 డిపోలకు చెందిన 14,230 మంది రేషన్‌దారులకు, 12ఆశ్రమ పాఠశాలకు, రెండు కళాశాలల వసతి గృహాలకు, ఒక కేజీబీవీ పాఠశాలతో పాటు 225 అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణి చేసే సరకులు ఇక్కడ నిల్వ ఉంటుంది. బియ్యం, కందిపప్పు, బెల్లం, రాగిపిండి, పంచదార, చింతపండు, ఉప్పు, నూనె, పసుపు, సబ్బులు వంటి సరకులు జీసిసి గోదాము నుంచి సరఫరా చేయాలి. కొన్ని సందర్భాల్లో సరకులు ఎలుకల బారినపడి నేలపాలవుతున్నాయి. వర్షాకాలంలో తడిచిపోయి పాడైపోతున్నాయి. దీంతో సరకుల నష్టాల బాధ్యత జీసీసీ గోదాము ఇన్‌చార్జిలదే. ఇప్పటికైనా జీసీసీ ఉన్నత అధికారులు పాడైన జిసిసి గోదాములపై ప్రత్యేక దృష్టి పెట్టి నూతన భవనాలకు నిధులు మంజూరు చేసి, నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చర్యలు తీసుకుంటాం

జీసీసీ గోదాము భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో సరకుల నిల్వకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.ప్రతి నెల సరకులను డిపోలకు, పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాకు సరఫరా వేగంగా చేయిస్తున్నాం. శిథిల భవనాల పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరైతే భవనాల నిర్మాణాలు యుద్ధప్రతిపాదికన మొదలు పెట్టి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– డి.సింహాచలం, జీసీసీ, డీఎం, పాడేరు

నీటి సంరక్షణపై అవగాహన అవసరం

జి.మాడుగుల/గూడెం కొత్తవీధి/చింతపల్లి/గంగవరం: జల్ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలలోని పలు ప్రాంతాల్లో అధికారులు అవగాహన కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ నీటిని పొదుపుగా వినియోగించాలన్నారు. ప్రాణకోటి మనుగడ నీటితోనే ముడిపడి ఉందన్నారు. నీటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. నీటి దుర్వినియోగాన్ని అరికట్టాలన్నారు. విద్యార్థులతో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. జి.మాడుగులలో జల్ ఉత్సవ్ జిల్లా కో-ఆర్డినేటర్లు పున్నయ్య, ఆనంద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, ఎంఈవో బాబూరావుపడాల్, ఏపీవో ఆనందబాబు, ఎంఆర్సీ సావిత్రి తదితరులు పాల్గొన్నారు. గూడెం కొత్తవీధిలో ఎంపీపీ బోయినకుమారి, ఇన్‌చార్జి ఎంపీడీవో ఇమ్మానుయేల్, ఈవోపీఆర్డీ పాపారావు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈఈ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు. చింతపల్లిలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కళ్యాణ్, వెలుగు ఏపిఎం శ్రీనివాసరావు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. గంగవరంలో వెలుగు డీపీఎం పరమేశ్వరరావు, ఏపీఎం షణ్ముఖరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సతీష్ , మైక్రో బయాలజిస్ట్ శ్రీలత, వెలుగు సీసీలు శ్రీనువాసరావు, అప్పారావు, సుశీల, గణపతి, మోహనలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా యువజనోత్సవం



విద్యార్థులకు బహుమతులిస్తున్న ప్రిన్సిపాళ్లు భరత్‌కుమార్ నాయక్, చలపతిరావు



జిల్లా స్థాయి పోటీలో మొదటి స్థానం సాధించిన రంపచోడవరం డిగ్రీ కళాశాల విద్యార్థినులు

అరకులోయ టౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత ప్రభుత్వం కేంద్ర యువజన వ్యవహారాల, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం సంయుక్తంగా బుధవారం నిర్వహించిన యువజనోత్సవాలను ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. గ్రూప్ కల్చరల్, సైన్స్ మేళా, గ్రూప్ యంగ్ రైటర్స్ కాంపీటేషన్, ఫొటోగ్రఫీ, పెయిటింగ్, నృత్య ప్రదర్శన తదితర అంశాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్, మహిళ కళాశాల ప్రిన్సిపాల్ చలపతిరావు మాట్లాడుతు విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలుగులోకి తీసుకురావడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కళాశాల సిబ్బంది అనితకుమారి, గౌరీశంకర్, నాగబాబు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జానపద నృత్య పోటీల్లో గిరిజన విద్యార్థుల ప్రతిభ

రంపచోడవరం: నెహ్రూ యువ కేంద్రం (విశాఖపట్నం) ఆధ్వర్యంలో అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన యువజనోత్సవాల్లో జరిగిన జిల్లాస్థాయి జానపద నృత్య పోటీల్లో రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినిలు మొదటి బహుమతి సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ తెలిపారు. డాక్టర్ ఆనంద్‌కు, కుమారిలు సమన్వయకర్తలుగా వ్యవహరించినట్టు చెప్పారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ గుమ్మ శ్యామ్‌సుందర్ తదితరులు

హుకుంపేట: అడ్డుమండ, దిగువ మోదపుట్టు గ్రామాల మధ్య ఉన్న గెడ్డ వద్ద రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ గుమ్మా శ్యామ్‌సుందర్ (అరకు ఎంపీ తనుజారాణి తండ్రి) కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుకుంపేట-పాడేరు మండలాల సరిహద్దు గ్రామాలైన అడ్డుమండ, దిగువ మోదపుట్టు గ్రాల మీదుగా పాడేరు వెళ్లేందుకు ప్రధాన రహదారి అయినప్పటికీ గతంలో వంతెన ఉన్నప్పటికీ వర్షాల కారణంగా కూలిపోయింది. గత ప్రభుత్వం హయాంలో తాత్కాలింగా వంతెన నిర్మించినప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలకు కుప్పకూలిందని, తాత్కాలికంగా పైపులతో వంతెన రోడ్డు నిర్మాణానికి ఐటీడీఏ రూ.14లక్షల నిధులతో పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. అరకు ఎంపీ తనుజారాణి చొరవతో వంతెన నిర్మాణానికి సుమారు రూ.3కోట్లుతో ని పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపించినట్టు ఆయన తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న సుమారు 30గ్రామాలకు త్వరలో మోక్షం లభించనున్నట్టు ఆయన తెలిపారు.

వ్యాధుల అదుపునకు చర్యలు

అరకులోయ రూరల్: వ్యాధులు అదుపు చేసేందుకు సచివాలయం, వెలుగు, వైద్య, ఆరోగ్య శాఖ, పంచాయతీ సిబ్బంది అందరూ ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో లవరాజు చెప్పారు. మండలంలో బస్కీ పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. గ్రామాల్లో తాగునీటి పథకాల నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా క్లోరినేషన్, బ్లీచింగ్ తదితర పనులు చేయాలన్నారు. గ్రావిటీ పథకాలు శుభ్రం చేయాలని, సురక్షిత నీరు అందించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్, సచివాలయం, వెలుగు, వైద్య, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు

ముంచంగిపుట్టు: మండలంలోని మాకవరం, పనసపుట్టు పంచాయతీల్లో మేభ, చిన్నసిరగంపుట్టు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో శ్రీనివాసబాబు మాట్లాడుతూ రైతుల నుంచి రాగులు క్వింటా రూ.4290 కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. వరి పంటకు సోకుతున్న తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలిచ్చారు. పశు వైద్య, వ్యవసాయ, ఉద్యానవన సిబ్బంది రామనాయుడు, మోహన్, ఆనంద్‌లు పాల్గొన్నారు.

మెరుగైన బోధన అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో కృష్ణమూర్తి

ముంచంగిపుట్టు: విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించే విధంగా ఉపాధ్యాయుల మెరుగైన బోధన అందించాలని ఎంఈవో కె.కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని లక్ష్మీపురం, బరడ పంచాయతీల్లో అంటబొంగు, సుత్తిగూడ, లక్ష్మీపురం ఎంపీపీఎస్ పాఠశాలలను, జీపీఎస్ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల హంసబంధ, లక్ష్మీపురం ఆశ్రమ పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. విద్యార్థుల వర్క్ బుక్స్‌ను పరిశీలించారు. పాఠాలు బోధించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయుల సమయపాలన పాటించాలని ఆదేశించారు. సర్పంచ్ త్రినాథ్ ఎంఈవోను కలిసి సుత్తిగూడ,లక్ష్మీపురం పాఠశాలలో భవనాలు పూర్తి చేయాలని కోరారు. హెచ్‌ఎం మణికంఠేశ్వరావు, సీఆర్‌పీ ఈశ్వరరావు తదితరులున్నారు.

పీఈటీ మృతికి సంతాపం



నాగరాజు (ఫైల్)

రాజవొమ్మంగి: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న కనితి నాగరాజు (33) ఆయన స్వగ్రామం ఎటపాక మండలం, నారాయణపురంలో బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన తీవ్ర అస్వస్థతకు గురికాగా కుటుంబీకులు భద్రాచలంలోని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్టు హెచ్‌ఎం గోపాలకృష్ణ తెలిపారు. నాగరాజుకు ఆరునెలల క్రితం వివాహం జరిగింది. భార్య కూడా పీఈటీగానే పనిచేస్తున్నారు. హెచ్‌ఎం గోపాలకృష్ణ, సహచర ఉపాధ్యాయులు తదితరులు నారాయణపురం వెళ్లి నాగరాజు భౌతికకాయానికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పి, అంత్యక్రియల కో సం రూ.20వేలను ప్రభుత్వం తరఫున అందజేశారు. పీఈటీ నాగరాజు మృతికి సంతాపంగా బుధవారం పాఠశాలకు సెలవు ఇచ్చారు.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

గంగవరం : రాజ్యాంగం కల్పించిన హక్కులు, ఫలాలు పొందాలంటే విద్య ఒక్కటే మార్గమని గంగవరం ఎస్ఐ డి.భూషణం అన్నారు. మండలంలోని భయ్యనపల్లి గ్రామంలోని ఉపాధి పనులను ఆయన బుధవారం పరిశీలించి కూలీలకు, రైతులకు అవగాహన కల్పించారు. సారా, గంజాయి వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ లోన్ యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సీలేరు: సీలేరు పోలీసుస్టేషన్ పరిధిలో వలసగెడ్డ గ్రామాన్ని ఎస్ఐ రవీంద్రనాథ్ బుధవారం సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత బాగా చదువుకొని ఉన్నతులుఆ ఎదగాలన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, సారా ఇతర డ్రగ్స్ జోలికి వెళ్లొద్దని హితవుపలికారు. సైబర్‌క్రైం విషయాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.పోలీసు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



రాజవొమ్మంగిలో ర్యాలీలో పాల్గొన్న గ్రామ మహిళలు, అధికారులు

రాజవొమ్మంగి: గంజాయి సమూల నిర్మూలనకు మహిళా సభ్యులు కూడా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని సీఐ సన్యాసినాయుడు కోరారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంఎంఎస్ కార్యదర్శి దేవి అధ్యక్షతన జరిగిన జరిగిన మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్ శాఖ తన వంతు కృషి చేస్తోందన్నారు. అనంతరం గంజాయిని నిర్మూలిద్దాం అంటూ చేపట్టిన ర్యాలీలో పాల్గొన్నారు. ఎస్ఐ నరసింహామూర్తి, ఏపీఎం రామాంజనేయులు, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొరాయిస్తున్న బస్సులు.. ప్రయాణికుల అవస్థలు



గూడెంకొత్తవీధి సమీపంలో సాంకేతిక సమస్యతో నిలిచిపోయిన సీలేరు-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ బస్సు

గూడెంకొత్తవీధి: కాలంచెల్లిన ఆర్టీసీ బస్సులు మన్యంలో తరచూ మొరాయిస్తున్నాయి. అధ్వానంగా ఉన్న గూడెంకొత్తవీధి – సీలేరు మార్గంలో ఆర్టీసీ బస్సులు మరమ్మతులతో నిలిచిపోతున్నాయి. బుధవారం ఉదయం సీలేరు నుంచి విశాఖపట్నం వెళ్తున్న నైట్ హాల్టు సర్వీస్ బస్సు అల్ట్రా డీలక్స్ బస్సు సాంకేతిక సమస్యతో గూడెంకొత్తవీధి సమీపంలోని పాతవీధి వద్ద నిలిచిపోయింది. దీంతో సుమారు మూడుగంటల పాటు అందులో ప్రయాణికులంతా ఇబ్బంది పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మన్యంలో కండిషన్‌లో ఉన్న బస్సులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ట



జీకేవీధిలో లక్ష్మీనృసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠలో వేదపండితులు, పురోహితులు

గూడెంకొత్తవీధి: మండలంలోని ఏబులం గ్రామం కుమ్మరవీధిలో లక్ష్మి నృసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులంతా కలసి ఆలయాన్ని నిర్మించుకోగా భీమిలిలోని సద్గురు ఆశ్రమం నిర్వహకులు సాయిరాం స్వామిజీ శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి విగ్రహాన్ని వితరణగా ఇచ్చారు. సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నృసింహస్వామి వారి దీక్షా ప్రచారకులు కసిరెడ్డి సురేంద్రబాబు ఆధ్వర్యంలో పూజలు చేశారు. భక్తులకు చీరలు, పంచెలను పంచిపెట్టారు. మన్యంలో దేవాలయాలకు విగ్రహాలు వితరణ చేస్తున్నట్టు భీమిలి సద్గురు ఆశ్రమం నిర్వహకులు సాయిరాం తెలిపారు. ఆయనను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. మాజీ జెడ్పీటీసీ నళిణి, మాజీ సర్పంచ్ బలరాం , సమరత సేవా పొండేషన్,గిరిజన అర్చక సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠించిన కనకదుర్గ అమ్మవారి విగ్రహం

వై.రామవరం: మండల కేంద్రంలోని చాకలిపేటలో కనకదుర్గ అమ్మవారి ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వెదురునగరం గ్రామ శివసాయి భువనేశ్వరి ఆశ్రమ నిర్వాహకుడు సాయిరామ్ గురుస్వామి, స్థానిక వేదపండితుడు ఆంజనేయశర్మల ఆధ్వర్యంలో హోమాలు, పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది.

గ్రామ సభల్లో అభివృద్ధి పనులపై తీర్మానం

దుంబ్రిగుడ/గూడెం కొత్తవీధి/చింతపల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్లాన్‌పై జిల్లా వ్యాప్తంగా ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు బుధవారం ఒక్కరోజు శిక్షణ జరిగింది.ఈ సందర్భంగా ఎంపీడీవోలు, ఇతర అధికారులు గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలను వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యులను చేయాలన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను గుర్తించి, గ్రామసభల ద్వారా స్థానికులచే తీర్మానాలు చేయించాలన్నారు. దుంబ్రిగుడలో ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, వైస్ ఎంపీపీలు శెట్టి ఆనంద్, లలిత, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కె.హరి, సర్పంచ్‌లు నాగేశ్వరరావు, శారద, సునీత, ఎంపీటీసీ సభ్యులు వరహాలమ్మ, రామారావు తదితరులు పాల్గొన్నారు. గూడెం కొత్తవీధిలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఇమ్మానుయేల్, ఎంపీపీ బోయినకుమారి తదితరులు పాల్గొన్నారు. చింతపల్లిలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీపీ కోరాబు అనూషాదేవి, జెడ్పీటీసీ బాలయ్య, వైస్ ఎంపీపీ గోపీనాయక్ శారద, వెంగళయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేతల ఆందోళన

అరకులోయ రూరల్/ముంచంగిపుట్టు/చింతపల్లి: అరకులోయలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీని కూటమి ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలుచేయకుండా పాలన సాగిస్తోందన్నారు. ట్రైబల్ సబ్ ప్లాన్ నిధులతో మన్య ప్రాంతాభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీలను చిత్తశుద్ధితో అమలుచేయాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ముంచంగిపుట్టు మండలంలోని లక్ష్మీపేటలో జరిగిన కార్యక్రమంలో పీఎం జన్‌మన్ లబ్ధిదారులతో సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. ఈ పథకంలో భాగంగా గృహ నిర్మాణాలకు రూ.5లక్షలు మంజూరు చేయాలని పార్టీ మండల కార్యదర్శి త్రినాథ్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నిధులు సరిపోవని, ఈ మేరకు నిధులు పెంచాలని, ఇసుకను ఉచితంగా అందించాని కోరారు. చింతపల్లిలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో నాయకుడు బోనంగి చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ నిత్యావసర ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించేంత వరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. నాయకులు చిన్నబాబు, భగత్‌రాం గోపాల్,నీలకంఠం, ధనుంజయ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

హైందవ ధర్మ పరిరక్షణకు కృషి

రంపచోడవరం/జి.మాడుగుల: రంపచోడవరం, జి.మాడుగుల మండలాల్లో బుధవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమంలో జరిగాయి. రంపచోడవరం మండలంలోని ఊట్ల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణరామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ హైందవ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జి.మాడుగుల మండలం సొలభం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం కార్యక్రమం కరపత్రాన్ని ఆవిష్కరించారు. రంపచోడవరంలో సర్పంచ్ ముర్రం లక్ష్మి, వైస్ ఎంపీపీ పండా కుమారి,, రామసేన సభ్యులు అయ్యప్ప,బాపన్నదొర తదితరులు పాల్గొన్నారు.జి.మాడుగులలో వీహెచ్‌పీ ప్రతినిధులు అప్పలరాజు, మచ్చమ్మ, తదితరలు పాల్గొన్నారు.